కథానిక

అతను ఇక రాడు

శ్రీ కొనకళ్ల వెంకటరత్నం

చంద్రరావు శివాలయానికి వెళ్ళి, పరమేశ్వరదర్శనం చేసుకొని, చిల్లరదేవుళ్లకు మ్రొక్కి, నవగ్రహ ప్రదక్షిణ చేస్తూంటేగా ఎదురయింది శశిరేఖ. చేతిలో వెండిపూలసజ్జా, చెవిలో తులసీదళమూ, తడిసిన మల్లెమొగ్గలావున్నదామె. సెలవులకు ఇంటికొచ్చింది గావును అనుకున్నాడు చంద్రరావు. అతనికీ ఆమెకీ సంబంధం నిశ్చయమై పదిహేనురోజులయింది. పలకరిద్దామా అనుకున్నాడు. కాని అంతలో సిగ్గుల రాముచిలక అయిపోయిందామె. ధ్వజస్తంభం పక్కనించీ తలవంచుకొని వెళ్ళిపోతూ తనవంక చూడకుండానే "ఒక్కమాట! ఇట్లా వస్తావా?" అని సాగిపోతూంది శశిరేఖ. చివుక్కుమన్నదతనికి. బి. యే. చదువుతోన్న తనకి నిశ్చయమైన వొక ప్రౌఢ అంత యేకాంతంగా తారసిల్లితే ఏదో వొకవంకని పలకరించాలిసిన చాకచక్యం తనకి లేకపోగా ఎదురు సిగ్గులతెర చీల్చుకొని ఆమే తనని పలకరించేసరికి తల కొట్టినట్టయిందతనికి. సరే—ఇహ తప్పుతుంది గనకనా — గంగిగోవులా కూడాపడ్డాడు. వెనకౌతల గుడిమంటపం మెట్లమీద కూచున్నారిద్దరూనూ. అంతా నిశ్శబ్దంగా వున్నది. ఊరిచివర పంట కాలవ పక్కనే వుంది శివాలయం. సజ్జలోవున్న శంఖుపుష్పాలూ పూకబంతిపువ్వులూ విడదీస్తో సుతారంగా మాటలకు దిగిందామె.

"నిశ్చయమయిందని నీకయినా తెలిసిందా బావా?"

"అదేమిటి? నీకు తెలియదాయేం?"—నెరజాణలా వుందే! ఇదో యుక్తిగావును!

శశిరేఖ మేనమామపోషణలో వుంది. తల్లీ తండ్రీ లేరు. చదువుకున్న పిల్లగదా! 'పెళ్ళి నిశ్చయించాము' అని చెప్పనక్కర్లే?— లాంఛనప్రాయంగానైనా? 'ఒకోక్కసారి పెద్దవాళ్ళకు మతుండదు' అనుకున్నాడు.

"అయితే యిప్పుడేమంటావూ?"

"నా కిష్టం లేదు."

పిడుగు పడినట్టయిందతనికి. తనంటే ఇష్టం లేదట! యీ దొరసానికి! స్కూల్ ఫైనల్ చదువుతోందిగా గుంటూరులో. అప్పుడే యే లండను దొరనో పెళ్లిచేసుకోవాలనుకొంటోంది గావును. పౌరుషం బుస్సున పొంగుకొచ్చింది. తమాయించుకొన్నాడు.

"అయితే అట్లా చెప్పేసెయ్. ఇప్పుడు మునిగిపోయిందేముందీ?"

చక్కాపోతున్నాడు. తన నిరుత్సాహమూ, ఉక్రోషమూ ఎక్కడ పసికడుతుందోనని గుండె పీకుతోంది. ఆవిడ అందకత్తె అనీ చదువుకున్నదనీ— అట్లాంటి శశిరేఖ తనకి భార్య కాబోతోందనీ తను మురుస్తున్నమాట నిజం.

"నేనా చెప్పుకోవాలిసిందీ?" అంటోంది, ఉత్కంఠంగా.

ఆగాడు—

"నువ్వు కాకపోతే నేనా కలిపించుకోవాలిసింది—ఈ స్థితిలో — ఒక చెంపన తాంబూలాలు పుచ్చుకుని ముహూర్తం నిర్ణయమైపోయి శుభలేఖలచ్చయిపోయి—అటు మీ వాళ్లూ ఇటు మా వాళ్ళూ పెళ్ళిపనులలో సతమతమవుతూంటే తగుదునమ్మా అని యిప్పుడు "నా కిష్టం లేదు" అని చెప్పవచ్చావా నువ్వు?"

"మొగాడవుకదా అని నాలిక ఎట్లా తిరిగితే అట్లా తిప్పకు. ఈ తికమకలన్నిటికీ నువ్వే కారణం."

చివ్వున లేచింది. ఇదో తారాజువ్వ ప్రకృతిలా వుంది.

"నేనా?" తెల్లబోయాడతను.

"అవును—శశి బంగారుబొమ్మ—శశినే చేసుకుంటాను—శశి నా ప్రాణం అని నాలిక బుజాన వేసుకొని తిరగటం లేదూ నువ్వు?"

అతను నేరస్తుడల్లే నిలబడ్డాడు. ఆమె అభియోగం, అక్షరాలా నిజం. ఆమె కిష్టం లేదని తన కేమి తెలుసూ—ఇష్టం లేనంతమాత్రాన తనని అలుసు చెయ్యాలి గావును—పూరికే తోముతోంది. చేసిన గాయాన్ని సీమ పచ్చిమిరపకాయతో కెలుకుతోంది పైగా. కాని జవాబు లోకువగా యివ్వకూడదు, అనుకున్నాడు.

"అవును నా కిష్టముంది కాబట్టి యిష్టమని చెప్పుకున్నాను. నీ కిష్టం లేకపోతే లేదని చెప్పలేక పోయినావా?" అని విదిలించాడు.

"వన్నెవ్వరూ అడగలేదు"—మౌనం.

"అడగాలిట—బొట్టూ కాటికా పెట్టి పిలిచి అడగాలి గావును."

"నువ్వంటే యిష్టమయింది కాబటి కనబడ్డవాడికల్లా పనిగట్టుకుని వెళ్లి దారిన పొయ్యేవాడినల్లా జబ్బబట్టుకొని ఆపుచేసి మరీ పూటలూగుతో..."

అదిగో మళ్ళీ విజృంభిస్తోంది. దీన్ని పెళ్ళిచేసుకుని ఆ పొగరుకాస్తా దించెయ్యాలనిపిస్తోంది. కాని తన పొగరే దించుతుందేమో! గోల!

"నీ బుర్ర అంతవరకే పోయింది మరి. నాకు నచ్చిందని నేను పూటలూరుతో చెప్పుకొంటే 'నాకు నచ్చలేదని నువ్వు మొహం చెండుకుంటూ చెప్పుకో లేకపోయావా?'—కచ్చగా అన్నాడు.

"నిశ్చయం చేస్తారని అనుకోలేదుగా నేను. అంచేత నా కిష్టంలేదు అని చెప్పాలిసిన అగత్యమూ నాకు పట్టలేదు."

"అనుకుంటే వాల్ పోస్టరమీద రాయించి అంటించేదానవు. పాపం! అవునా?"

"తప్పకుండానూ"

అన్న పొగరు! చురుకూ చురుకూ చూస్తోంది పైగా! ఏమిచేస్తుందో మరి!

"నాకు తెలిసిందిగాదు మరి. ఏమిచెయ్యమంటావు చెప్పు?" అన్నది అంతలో కోపం దిగమింగి.

"తెలియకపోతే తెలుసుకోవాలిసింది."

"మరిప్పుడు జరగాలిసిం దేమిటి అని" లాలనగా ప్రశ్నిస్తోంది.

"తెలుసుకోలేను గనక అనుభవించం తే" మళ్ళీ లేచాడు. రోగం కుదిరింది.

"కూచో మరి"—

కూచున్నాడు, నమ్రతగా—ఏదో దౌర్బల్యం ఏడిపిస్తోంది లోపల. వెళ్ళాలని లేదు. ఇష్టం లేకపోతే లేదని చెప్పెయ్యరాదూ తనవాళ్ళతో—దీనికి తన సలహా సంప్రతింపులు కావాలా్నయేం?

"మీకుమాత్రం మక్కర్లేదండీ సార్ నా కిష్టమున్నదో లేదో...?"

మళ్ళీ వెటకారాలకి దిగింది!

"నా కక్కర్లేదు", పుల్ల విరిచినట్టు మొహాన్ని కొట్టాడు. నిజానికి ఆమె యిష్టపడే ఉంటుందనీ అంచేతనే పెళ్ళికి బప్పందం జరిగిందనీ అనుకున్నాడతను. లేకపోతే స్కూలు ఫైనల్ చదువుతున్న పిల్లని, వయసొచ్చిన పిల్లని, ఆమె యిష్టానిష్టాలు కనుక్కోకుండా పెళ్ళి నిశ్చయం చేసి పారేస్తారని తనెల్లా అనుకుంటాడు?

"నీకక్కర్లేదూ?—బింకాలకు పోకు—నిన్ను చూచీ నీ అందం చూచీ మోహించాననుకున్నావ్ గావును—అవునా?"

కస్సున లేచాడు—

"మాటలు తిన్నగా రానీ—ఆడదానవు కాబట్టి సరిపోయింది. లేకపోతే ఎంత దూరమైనా వచ్చేది. నీ అంతస్తూ హద్దూ, చూచుకుని బుద్ధిగా మెలగడం నేర్చుకో—తెలిసిందా?"

"వాదం పెంచక నువ్వే ఏదో చెప్పి పెళ్లి ఆపు చెయ్యి—తెలిసిందా? నీ హితం కోరే చెపుతున్నా."

"నేను చెప్పను—చెప్పను.. ...ముమ్మాటికీ చెప్పను—నా కవసరం లేదు."

"ఇప్పు డేదో విధాన ఆటంకం కలిపించకపోతే పెళ్లి జరిగిపోతుందో యేమిటో" అన్నది సగం స్వగతంగా.

"జరగనూ జరుగుతుంది" అన్నాడు తొణుకూ బెణుకూ లేకండా—తనూ ఏడిపించగలనని ఆమెకి బాగా తెలియాలి—

ఇక వెళ్ళిపోతోంది—పూలసజ్జ అందుకొని, వెడుతూ వెడుతూ వో చిన్న బెదిరింపు!

"తరవాత విచారించినా లాభం లేదుసుమా. నువ్వంటే యిష్టంలేని ఒక కన్యని, యిష్టంలేదని— మళ్లీ చాటునా మాటునా కాదు—నీ మొహంమీద కుండ బద్దలు కొట్టినట్టు చెప్పకొన్న ఒక కన్యని పెళ్ళిచేసుకుంటే రాగల ప్రమాదం రవంత వూహించుకోడం మంచిది"

అతని కోపం భగ్గుమంది. ఎంత మాటన్నదీ? సున్నితంగా దెబ్బకొట్టి తనూ లేచిపోవాలి.

"ఇదిగో అమ్మాయీ చెప్తా విను. ఇష్టంలేనిది నీకు. ఇష్టంలేదని చెప్పాలిసింది నువ్వు. సకాలంలో ఆమాట చెప్పకపోగా నీ యిష్టమొచ్చినట్టు నాలిక పారేస్తున్నావ్; తప్పు నీది; అయినా మించిపోయింది లేదు ఇప్పుడైనా యిష్టంలేదని మీవాళ్లతో చెప్పు; చెప్పి పెళ్లి తప్పించు. నీకూ నాకూ శుభం. నీ కిష్టమున్నా లేకపోయినా, ఎల్లాగో ఒకలాగు నిన్ను కవుగిట్లోకి బలవంతాన తీసుకుందామని నా కేమీ లేదు అల్లా చెప్పవూ, చెప్పక బింకాలు పోతావూ, నేనుమాత్రం చేసేదేమీ లేదు పెళ్ళి జరిగిపోతుంది. జరిగితీరుతుంది. ఆ తరవాత నిన్ను ఓ దాసిలాగానో, ఒక వుంపుడుకత్తెగానో చూస్తాను. నిన్ను భార్యగా చూడను—చూడలేను. ఏ స్కూలుమాష్టరుగానో ఏ ఆసుపత్రి నర్సుగానో చెలాయిద్దామని చూస్తున్నావు గావును. నీ బతుక్కి ఏ చిత్రాంగి వీధిలోనో, ఏ సఫేదుగల్లీలోనో దుకాణం తెరవాలిసిన దుర్గతి పట్టిస్తాను. చూసుకో—రాగల ప్రమాదాల్ని వూహించుకోవాలి గదూ?"

చివాల్న లేచి సింహద్వారందాకా విసవిస నడిచాడు.

"ఒక్కమాట"

గిరుక్కున తిరిగిచూచాడు. వెక్కి వెక్కి యేడుస్తోంది పాపం! అల్లా దారికి రావాలి. కొంత స్థిమిత పడ్డాడు. లేకపోతే, పౌరుషాలు రెచ్చగొట్టి పని చేయించుకోవాలని చూస్తుందీ?

జాలి కలిగింది.

ఆ ధిక్కారంవెనక ఎంత బాధ, ఎంత ఆవేదన ఉన్నదో పాపం! తను కరిగిపోతున్నాడేమిటీ మంచు బిళ్ళలా? మగాడి కీలకం గ్రహించిందా? గ్రహించి యథోచితంగా ప్లేటు మారుస్తోందా? ఏమో దిక్కుమాలినగోల—ఏమయినా, అతనిలో దెబ్బతిన్న మగతనం కోలుకుంది.

దగ్గరగా వెళ్లి నిల్చున్నాడు. జేబురుమాలతో కన్నీళ్లు తుడుద్దామా, అనుకున్నాడు. అగ్గిమీద గుగ్గిలం అవుతుందేమో—లేనిపోని కుమ్మరాం—అసలే ఈ అప్సరసకి తనంటే అయిష్టంట—

అరె—ఇంకా ఏడుస్తోందేమిటి? బావుంది తనేమి చేశాడనీ? నేరస్తుడల్లే బాధపడ్డాడు. అతని కేమీ పాలుపోలేదు.

వంగి, "అమ్మాయీ, ఎందుకట్లా ఏడుస్తావూ?" అన్నాడు వోదార్పుగా. కన్నీళ్ళు గబగబా తుడుచుకుంది.

"నామాట ఎవరూ లెఖ్ఖచెయ్యరు బావా! నేను చెప్పినా, ఆగదీ పెళ్ళి" అన్నది గాద్గదికంగా."

"ఎంచేతా అని—అదీ నాకు పట్టుకుంటు?" అని అడిగాడు.—కొంత సమాధానంగా.

"నేనొక అనాథనని నీకు తెలియదా? మా అమ్మ చనిపోతూ నన్ను అయిదేళ్ళపసికందుని, మా మామయ్య చేతిలోవుంచి హరీ అన్నది. ఆ బరువు తన బుజాలమీదనుంచి వొదిలించుకుంటున్నాడివాళ. నామాటకు విలువ ఏమి ఉంటుందిచెప్పు. నువ్వన్నట్టే యిదివరకే ఏడవలేకపోయినావా యీ ఏడుపు అని రెండు మొట్టికాయలు మొట్టి పెళ్ళిపీటలమీద కూచోపెడతారు. కట్నాలూ కానుకలూ లేకుండా అతి చవుకగా నువ్వు దొరికావుగదా అని నన్ను వొదిలించుకోవాలని చూస్తున్నారు."

అదుగో—ఆ ఆఖరిమాటలు తనకెంత అవమానకరంగావున్నయ్యో తెలిసికోడు. అదీ వచ్చినచిక్కు. ఆమెకళ్లింకా మంచుతోనిండిన మల్లెపువ్వుల్లా వున్నాయి. ఆ కంఠస్వరంలో దీనత్వమూ, ఒక నిస్సహాయతా, ఒక్క మాటలో చెప్పాలంటే, ఆకర్షణ గల అబలాత్వమేదో తళుక్కుమని స్ఫురించిందతనికి.

ఆలోచించాడు.

"సరేలే, నేనే కలిపించుకుంటానులే, వెళ్లు" అని తల వంచుకున్నాడు. పూలసజ్జ చేతిలో పట్టుకుని వెళ్లిపోతోందామె. మళ్ళీ చివుక్కుమన్నదతని హృదయం. ఆ నిష్క్రమణలో, విచారం తప్ప, తనమొహాన చూపాల్సిన కృతజ్ఞతగాని, వొక అపాయంనుంచి తప్పించుకొన్న ఆహ్లాదవైఖరి గాని, అవుపడదేం? వెళ్లిపోతోంది శశిరేఖ—బ్రతుకే శూన్యమైపోయినట్లనిపించిందతనికి—

రాత్రి 'షా' నాటకం చదివిన తరవాత లాంతరు తగ్గించి, రగ్గులో తలదూర్చి ఆలోచిస్తూ పడుకున్నాడు. చంద్రరావు. కారాలు కొట్టీ, పప్పులు వేయించీ, అప్పడా లద్దీ, ఇంట్లో అలిసి అంతా నిద్దరపోతున్నారు. తనకీ తల్లితండ్రులు చిన్నప్పుడే కరువయ్యారు. ఎటొచ్చీ, తన చదువూ పెళ్ళీ, పెత్తండ్రి రామయ్య కొంత పట్టించుకుంటున్నాడు. పోతూ, పోతూ తనతండ్రి పడిపోతూవున్న పూరిపాక వొకటి ఈయనకప్పగించాడని వినికిడి. అది అమ్మగా వచ్చిన నాలుగు రాళ్లూ, తనకోసం వెచ్చిస్తున్నట్టు కనిపిస్తుంది. అది అంతనీ, ఇంతనీ తేల్చుకునేందుకు తనకు దమ్ములు లేవు; ఎవరూ చెప్పరు. తన చదువుకి చిల్లిగవ్వ ఖర్చు కావటం లేదు. స్కాలరుషిప్పులతోనే గడిపేస్తున్నాడు. ఇక బి. యస్. సి. సమాప్తి కావాలి. తను కాకినాడలో వారాలు చేసుకొని తింటున్నట్టు ఎవరికీ తెలియదు. తన పోషణా, తన విద్యాదికాలూ, సొంత ఖర్చుమీద భరిస్తున్నట్టూ, తన పెళ్లీ, తన ఆలనాపాలనా అంతా తనభుజస్కంధాలమీదనే పడివున్నట్టూ పెత్తండ్రి వీలయినచోటల్లా గప్పాలు కొట్టుకుంటూ పోతున్నాడు. అవునని తనూ తలవూపేస్తున్నాడు. లేకపోతే 'నిజం ఫలానా' అని విడమర్చి చెప్పుకుంటే, తనకే అప్రతిష్ఠ. తనకీ వో యిల్లంటూ వున్నదనీ, స్నేహితులమధ్య రుజువుచేసుకుందుకు, ఏదో నాలుగురోజులు కాలక్షేపం చేదామని, సెలవులలో వచ్చాడు పెంటపాడు. తన పెత్తల్లికయినా తనమీద మమకారం అంతంత మాత్రమే. ఈ పరిస్థితిలో తను అంతంత కష్టపడి కుదిర్చిన సంబంధం, పెళ్ళిముహూర్తంనిశ్చయమయిపోయింతరవాత, పెళ్ళిప్రయత్నాలు ఆఖరిఘట్టంలో పడుతున్న సమయంలో, ఇన్నాళ్ళూ 'అప్సరసలాంటి పిల్ల, చిదిపి దీపం పెట్టవచ్చును' అని తను చెప్పుకొంటూ వస్తున్న పిల్ల, ఈనాడు 'నాకు నచ్చలేదు' అని ఎట్లా చెప్పడం. తన పెత్తండ్రి అసలే చండశాసనుడు. విరుచుకుని మీదపడతాడు. ఆయనంటే తనకి విపరీతమయిన భయం. ఆయనవల్ల తనకి వొరింగిందున్నా లేకపోయినా 'నా' అన్న అండకింద పనికొస్తున్నాడు.

ఒక వేళ తను సాహసించి 'శశిరేఖ నాకు నచ్చలేదు' అని చెప్పడానికి పూనుకున్నా, చుట్టుపక్కల వాళ్ళు, తన నోరే మూయిస్తారు. ఎవడూ నమ్మడు—సీరియస్‌గా తీసుకోరు కూడా. ఆ అమ్మాయంటే పడి చస్తున్నాడాయిరి. ఆ అమ్మాయి ఫొటోలన్నీ తన క్లాసు పుస్తకాలలో నయితం, లోపలి అట్టలో భద్రంగా అంటించుకుని, దానికింద 'నా శశి' అని వ్రాసుకొని పేజీ కోమారైనా, ఆ ఫోటో వంక చూచుకొని గాని, తరువాత పేజీకి వెళ్ళకుండా మిడుకుతున్నాడాయిరి. తను ఎంత పిచ్చివాలకంగా వ్యవహరించాడో తలుచుకుంటే, శశిరేఖకి తను అలుసయిన కారణం లీలగా గోచరించిందతనికి. ఇప్పుడు కూడా తనొక పిచ్చిధోరణిలో వున్నట్టే లెఖ్ఖ. ఇష్టంలేనిది ఆవిడకా! అట్లా స్పష్టంగా చెప్పి, పెళ్లి ఆపుచెయ్యవలసిన అవసరం ఆవిడకుండగా, తనని నానామాటలూ అని, ఆఖరికి నంగనాచిలా బుడిబుడి దుఃఖాలుపోయి, కడివెడు కన్నీళ్లు కార్చి, ఇదేమిటో సర్దుబాటు చెయ్యమని తన నెత్తిన రుద్ది చక్కాబోయిందీ! సరేలే, అని ఆ ఘనకార్యం చేస్తానని వాగ్దానమిచ్చి, వీరాధి వీరుళ్ళా వొచ్చేశాడూ తను? ఏమి సొగసుగా వుందీ? ఆపిల్ల ప్రవర్తననిగురించి ఏవో అనుమానాలు తన చెవికి సోకినట్టు, పెత్తండ్రికి చల్లగా వూదితేనో—ఈ దట్కారీ సంబంధం మనకెందుకురా బాబూ అని తెగతెంపులు చేసుకుంటాడు తప్పకుండా. సంప్రదాయమంటే ఆయన చెవి కోసుకుంటాడు కూడాను. తీవ్రంగా ఆలోచించాడు. తన పెత్తల్లి కొంత గయ్యాళి రకం. వదినకి సరేసరి నోట్లో నువుగింజ దాగదు. వీళ్లు యీ రహస్యం యాగీచెయ్యకుండా వుంటారా? అందులోనూ, ఇందాకా వచ్చింతరవాత పెళ్ళి ఆగిపోయి, పుకారు పుట్టిందంటే, నడివేసంగిలో పూరిళ్ళమధ్య తాటాకుపాక అంటుకున్నట్టే ... ఇహను ఆపిల్ల భవిష్యత్తు చెప్పాలీ? భగ్గూ వెలుగూ. మెడకాయమీద తలకాయ వున్నవాడు తలవొగ్గడు. తనెంతో పవిత్రంగా ఎంచుకుంటూ వచ్చిన శశిరేఖ పేరు గోడలమీద కొంటెకోణంగుల రాతలలో, ఆకతాయి అల్లరిపేలాపనల్లో, ఇరుగుపొరుగువారి హేళనలో తగలబడిపోతుంటే తను సహించలేడు. మళ్ళీ ఏదో అజ్ఞానంలో పడిపోతున్నాడు. లేకపోతే ఈ శశిరేఖంటే తనకెందుకూ యింత అభిమానం? ఆవిడ ఏమయితే తనకెందుకూ? తన కష్టసుఖాలేమైనా పట్టించుకున్నదా, ఆవిడ. తరచి తరచి చూచుకోగా, ఈ శశిరేఖ తనది కాకపోయినా తనలో ఏదో అలజడికి కారణమవుతున్నట్టు గుర్తించాడతను. లేకపోతే తను అనుకోని ప్రేమాంకుర మేదయినా నిప్పురవ్వలా పనిచేస్తోందా లోపల? అతని గుండె ఝల్లుమంది. అంతే అయి వుంటుంది. లేకపోతే ఈ గుంజాటన దేనికీ? తటపటాయింపు దేనికీ? తర్జనభర్జన దేనికీ? ఆపిల్ల తాలూకు

భూత, భవిష్యద్వర్తమానాలకు తను గార్డియనా? ఇంకా నయం ఎందుకిష్టంలేదు అని తను శశిరేఖ నడగలేదు. అడిగితే, ఫెళ్లున తననీ తన అందాన్నీ వర్ణించి చెప్పగలదు. కుమిలి చావాలిసొచ్చేది. అంత తెలివితక్కువ ప్రశ్న వేయనందుకు తనను తానే అభినందించుకున్నాడు. తనేమైనా స్వతంత్రుడా "మొన్న నచ్చింది, మరి యివాళ నచ్చలేదు అని కళాకళలుగా మాట్లాడి నెగ్గించుకునేందుకు..."ఆపిల్ల నా మొహాన్నే చెప్పింది నేనంటే యిష్టం లేదని" అని పెత్తండ్రితో బయటపడదామా అనుకున్నాడు. అటు శశిరేఖ మేనమామకి ముక్కుమీద కోపం. సంప్రదాయానికి దెబ్బతగిలిందంటే ఎంతమాత్రమూ సహించడు. ఇష్టంలేకపోతే యింట్లో గుంభనగా చెప్పకోవాలా, విచ్చలవిడిగా "నువ్వు నాకఖ్ఖర లేదని" ముఖాముఖీ వరుడితోనే ఘర్షణకి దిగాలా, అని ఆమెని దండిస్తాడేమో? ఆ హింస తప్పకునేందుకే తనని ఆశ్రయించిందేమో శశిరేఖ. అందాకా వస్తే 'నా కిష్టమేను' అని ఆమెచేత బలాత్కారంగా వొప్పించనూ గలడు. వొప్పకున్నట్టు చెప్పించనూ గలడాయన.

మరి ఇహ నీ పెళ్లి ఎట్లా తప్పించగలడో బోధ పట్టంలేదు.

శశిరేఖా, తనూ పెంటపాడులోనే పుట్టి, పెంటపాడులోనే పెరిగారు. ఎటొచ్చీ నాలుగేళ్ళ నుంచీ తను కాకినాడలో కాలేజీచదువులోనూ, ఆమె గుంటూరు మిషన్ హైస్కూల్లో పింతల్లి గారింట్లోనూ వుంటూవచ్చారు. అంచేత అన్యోన్యం చూచుకుందుకు అవకాశాలు సన్నగిల్లినా, తనకిమాత్రం శశిరేఖంటే ఆకర్షణ తగ్గలేదు. చిన్నప్పుడు, 'బావ' 'బావ' అని పిలిచేది. తను శశీ అని పిలిచేవాడు. ఆ తీయని కల ఈనాడు ఇట్లా తారుమారయింది.

ఈ పెళ్ళిగాని తప్పిపోతే, మరి పెళ్ళిమాట తలపెట్టగూడదు అనుకున్నాడు. తనకి పిల్ల నివ్వడానికి, కాళ్ళు విరుచుకుంటున్నవాళ్లెవరూ లేరని తెలుసును. మొట్టమొదటసారి తన అందంమీదా తన స్తోమతుమీదా తన వునికిమీదా ఒక ఏహ్యాభావం కలిగిందతనికి. శశిరేఖ తనకి సుముఖంగానే వుంటుందని యాదాలాపంగా అనేసుకుని చక్కా వూరుకున్నాడు, తెలివితక్కువగా—ఆమెనని యేమి లాభం? ఆమె రూపసి, చురుకైనపిల్ల. తన పరిస్థితిని అన్ని వేపులనుంచీ, చీల్చి చూచుకొని వుంటుంది.

బహుశా: తనకి యిల్లా వాకిలా, బలగమా, డబ్బా దస్కమా, అందమా చందమా, దర్జానా? ఏ మాకర్షణ తనదగ్గర వుందని తనని మోహిస్తుంది శశి? ఇన్నాళ్ళూ ఏదో తన గొప్ప తను వూహించుకుని ధీమాగా బ్రతికాడు. ఒక్క శశిరేఖ తృణీకరించగానే తన అవతారమేమిటో తన విలువ ఏమిటో, నిలువుటద్దంముందు నిలుచున్నట్టు తెలిసొచ్చిందతనికి. ఆ పరాభవంతో ఒక్కసారిగా కుంగిపోయాడు.

రాత్రి చాలా భాగం గడిచిపోయినట్టుంది. వీధిలో లైట్లు కుప్పున ఆరిపోయాయి. ఉపాయం చట్టున స్ఫురించిందతనికి. ఒక నిశ్చయానికి వొచ్చేశాడు.

* * * *

పెరట్లో కంచాలు కడిగి, పిల్లల మూతులు తుడిచి భోజనాలయినచోట నీళ్లు చల్లి, మామయ్యకు పొగాకుగొట్టమందిస్తోంది శశిరేఖ. పోస్టుమేన్ ఏదో వుత్తరమిచ్చి వెళ్లాడు. రామచంద్రయ్య ఆ వుత్తరం చదువుకొని, ఎందుకనో దిగాలుపడి మడతకుర్చీలో కూలబడ్డాడు. శశిరేఖ గమనించింది. అదేమిటో మామయ్యా చెప్పేదాకా ఆగాల్సిందేకాని, ఈలోగా ఆరాలడిగితే చివాట్లు తగుల్తాయి. అంచేత అమ్మణ్ణి వొలకబోసిన పౌడరు డబ్బా సర్దుతో అక్కడే ఏదో వొకవంకని తచ్చాడుతూ వుంది. కాని మామయ్య ఏమీ చెప్పదలుచుకోలేదు. రాత్రి ఇంట్లో గుసగుసలు ప్రారంభమయినాయి. ఆ యింటికీ, పొరుగునవున్న మెంతివారింటికీ వుమ్మడి తలుపొకటుంది. ఇద్దరికి వైరాలు ముదిరితే ఆ తలుపులికి తాళాలు పడతాయి. పొత్తుగా వుంటే గొళ్లేలు పడివుంటాయి. ఇప్పుడా తలుపులు బార్లా తెరుచుకుని వుంటున్నాయి. ఆ వుత్తర మొచ్చిందగ్గిరనుంచీ, ఆ యింటివారూ, ఈ యింటివారూ చెవులు తెగకొరుక్కుంటున్నారు. అత్తయ్య సరే, ఆ తలుపుదగ్గర కాపురమే పెట్టేసింది. ఇంట్లో అంతా కారాలూ మిరియాలు నూరుతున్నారు—కారణం గ్రహించలేకుండా వొచ్చింది.

రాత్రి వో నిద్దరోయింతరవాత మెలుకువ వచ్చింది శశిరేఖకి. పంచపాళీలోనుంచి మాటలు వినవస్తున్నాయి. చెవులు దోరబెట్టుకుని వింది. చంద్రావుకి క్షయవ్యాధి వున్నదని ఆకాశరామన్న వుత్తరము వచ్చిందట మేనమామ రామచంద్రయ్యకి. ఆమె గ్రహించింది. చంద్రావు కలిపించి వ్రాసి వుంటాడు బహుశా. ఆ వీధిన కందికట్టువారికీ, ఈ వీధిన దాపర్తివారికీ దొమ్మీ జరిగినంత పనయింది మర్నాడు. పెళ్లికి తెగతెంపులయినాయి.

శశిరేఖకి ఖంగా రెక్కా వయింది. చివరి కెట్లా పరిణమిస్తుందో యేమిటో. మామయ్య ఇంట్లో అడుగు పెట్టగానే ఆమె గుండె వేగంగా కొట్టుకొంటోంది. ఆపైన గదిలో గడియవేసుకుని బిక్కు బిక్కు మంటూ కూచుంటుంది. పెళ్లి చెడిన కారణంగా తను కాకపోయినా తన జాతకచక్రం గురిఅవుతోంది, అందరి ఆగ్రహాలకీ. అట్లా తలదాచుకుందుకు ఆస్కారం లేదు. ఇంటిపని అందుకోకపోతే అత్తయ్య సాధిస్తుంది. మామయ్య కేక లేస్తాడు. వొదిన పిల్లిమీద పెట్టీ, పిచికమీద పెట్టీ సూటీపోటీమాట లంటుంది. మొహం చూపితే అంతా కొరకొరలాడుతున్నారు. తల దాచుకుంటే అంతా సాధిస్తున్నారు. సెలవ లెప్పుడై పోతాయా అని కూచుంది.

మామయ్యకి చంద్రరావం టే ఎంతో అభిమానం. అతను చాలా బుద్ధిమంతుడు. అతని లోటుపాట్లన్నీ అతనే తనతో వొకసారి ప్రస్తావించి చెప్పాడు. తనకి చిల్లిగవ్వ లేదనీ ఇంట్లో గాని, ఆస్తిపాస్తులలో గాని పెత్తండ్రివల్ల తనకి సంక్రమించేది పూరి పుడకైనా వుండదనీ స్పష్టంగా చెప్పాడు. బి. యస్. సి. ప్యాసయిన తరువాత వుద్యోగం దొరికితే సరేసరి. లేకపోతే ఏ పెన్సిలు మేన్యుఫాక్చరింగో పెట్టుకుంటాననీ ప్రస్తావించాడు. ఈ రహస్యం ఎందుకు బైట పెట్టలేదా అని మీమాంస పట్టుకుంది మామయ్యకి. అతన్నే అడిగి తేల్చుకుందా మనుకున్నాడు. ఎవరైనా దుర్మార్గుడు అతనంటే గిట్టనివాళ్లు ఈ అభాండ మతని నెత్తిన వేశారేమో.

మాధవరంలో మున్నంగివారు, అటు కందికట్టువారికీ, ఇటు దాపర్తివారికీ కావలసిన బంధువులు. మున్నంగివారింట్లో పెళ్లికి ఆ యింటివారూ, ఈ యింటివారూ తర్లి వెళ్లారు. సాయంత్రం క్రీనీడలు పొడుగు సాగుతున్నాయి. పెళ్లివారిల్లు కిటకిటలాడుతోంది. శశిరేఖకి చిరాకుగా వుంది. మేనల్లుడు బాజీని తీసుకుని షికారుగా బల్లకట్టుదాటి పంటకాలవ కెగువని బాడితిచెట్టునీడని చాలా సేపు కూచుని, పొద్దుకుంకే వేళ తిరుగు మొహం పట్టింది. మలుపు తిరగగానే కాలవ గట్టువాలుమీద సరుకుచెట్ల క్రీనీడని ఇసుకలో టర్కీ తువాలు పరుచుకుని చదువుకుంటున్నా డొక కాలేజీ కుర్రాడు. గబగబ అడుగు లేసింది. అతను చంద్రరావు! రామయ్యగారి తాలూకు వచ్చారని తెలుసుగాని, చంద్రరావు వచ్చాడనుకో లేదు.

వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లయింది. ఈవారంరోజులలోనూ అతనెంతో చిక్కిపోయాడు. కళ్ళల్లో నిద్రాభారం కనిపిస్తోంది. ఇంత పరకాయించి ఎవరివంకా చూడలేదు తనింతవరకూ. అతనికి తన కృతజ్ఞత చెప్పుకోవలసి వున్నది. అతనితో మాట్లాడాలిసిన పని వున్నదికూడా. అతని వ్యాధిని గూర్చి అతనినే అడిగి తెలుసుకుంటానన్నాడు మామయ్య. "ఎవరో గిట్టనివాళ్లు వ్రాసి వుంటారు, నా కట్లాంటి వ్యాధి ఏమీ లేదు" అని చంద్రరావు అన్నాడా మామయ్య తప్పకుండా అతన్ని నమ్ముతాడు. అతనంటే మామయ్య కంతగురి నిజానికి అతని కట్లాంటి వ్యాధి వున్నదని ప్రచారం కావడం తన కెంతమాత్రమూ యిష్టం లేదు. దానివల్ల తన కుపకారం జరిగినా అతనిభవిష్యత్తు అప్పుడే చాలావరకు భగ్నమయిపోయింది. అతిసామాన్యమైన సంసారులుగూడా అతనికి పిల్లనివ్వడానికి జంకుతున్నారప్పుడే. తనసంబంధం నిశ్చయం కాకపూర్వం అతనికోసం మెగబడినవాళ్లంతా "ఇంకా నయం, మనం తొందరపడలేదు" అని, ఇహ నా ప్రసక్తి విరమించుకున్నారు.—ఆగింది.

అతను కన్నెత్తి చూడలేదు. కొంచెం దూరంగా కూచున్నది. "ఆఉత్తరం నువ్వేనా రాస్తా బావా" అని అడిగింది, వోరగా చూస్తో అతనింకా పుస్తకం చదువుకొంటూనే వున్నాడు. చాలా కోపంగా వున్నట్టుంది. ఆ పరిస్థితిలో వాళ్ళిద్దరినీ ఎవరైనా చూచినా ఏమైనా అల్లి పారెయ్యగలరు. ఆమె అభిమానం కొంత గాయపడిందికూడా. ఉన్నట్టుండి "కసితీరిందా?" అన్నాడు చంద్రరావు. "బావా, ఎందు కట్లా వ్రాశావు? ఈ పెళ్ళి తప్పించడానికి, నీ విట్లాంటి విపరీతమైన పంథా తొక్కుతావని తెలిస్తే నేను తప్పకుండా వారించేదాన్ని..." అతనిక పుస్తకం మూసేశాడు. "ఇదిగో శశీ, పిచ్చివాలకంగా మాట్లాడకు... నా యింట్లో నా కెంత స్వాతంత్ర్యమున్నదో నీకుమాత్రం తెలియదూ?".. కాలి బొటనవ్రేలితో రాస్తో మౌనం వహించింది శశిరేఖ. "శశీ" అని తనని పిలవడంలో వున్న చనువూ ఆంతర్యమూ గుర్తుపెట్టుకుంది. మళ్లీ పుస్తకం చదువుకొంటున్నాడతను. అతనివంకే చూస్తూ కూచున్నదామె. అంతత్వరలో వెళ్ళిపోవాలని లేదు. "అవును గాని నాకు తెలియక డుగుతాను. నాకు క్షయవ్యాధి వున్నదని, ఇంటింటా వాడవాడలా నాలిక బుజమ్మీద వేసుకుని చాటింపేస్తేనేగాని మీకు తృప్తి తీరదా యేం?"

"నేనేంచేశాను చెప్పుబావా." అంటున్నది శశిరేఖ.

"నువ్వేమీ చెయ్యలేదనే అడుగుతూంట"

"నాకు తెలియనివ్వలేదు. నిజానికి "

"అదుగో—తెలిసిం తరవాత నువ్వు తీసుకున్న చర్య యేమిటో చెప్పు. మీ మామయ్యతోగాని అత్తయ్యతోగాని, అతని సంబంధం మన మెల్లానూ పొగులుకుంటున్నాముగదా, అతని పేరు యెాగీ చెయ్యట మెందుకు మనకీ, అని వొక్క మాట చెప్పి చూచావా నువ్వు?" తనవంక చూడకుండా చూపుడు వ్రేలు మాత్రం తనవేపు చురుగ్గా చూపుతూ సమాధానంకోసం ఎదురుచూస్తున్నాడతను. నిలువునా నీరయిపోయింది శశిరేఖ అతనివల్ల తనకి జరిగిన వుపకారాన్నీ, తనవల్ల అతనికి జరిగిన అపకారాన్నీ పోల్చి చూచుకుని ఎంతో కించపడింది. నిజమే, అతని భవిష్యత్తు మట్టిపాలవుతూంటే తను చేసిం దేమిటి? తన కళ్ళకట్లేని పెళ్ళి నిలిచిపోయిందేచాలని మురవపెంకన్న! అపరాధం వొప్పుకుని మౌనంగా వూరుకుంది. "అట్లా వుండాలి—అయినా నీకేమి పట్టిందిలే వెళ్ళు—నీ సంకల్ప మీడేరిందిగా! ఇహ కోరుకున్న వరుణ్ణి పెళ్లి చేసుకుని హాయిగా కులుకుతూ సంసారం చేదువుగానిలే. ఈ ప్రచారంవల్ల నాకు అదనంగా కలిగే నష్టమేమీ లేదులే! నీస్వార్థం ఎంతవరకూ పోయిందో చూపుతున్నాను నీకు. అంతే. నాకింక పిల్లనిస్తామనికూడా ఎవరూ రారని మురుస్తున్నావు గావును. పెళ్ళి పెటాకులూ ఆనాడే మానుకున్నాను. నువ్వు నా అందాన్నిగురించి వుపన్యాసమిచ్చిన రోజున" అని వొక్క బిగిని తన అక్కసంతా తీర్చుకున్నాడతను.

శశిరేఖ "నా తొందరపాటుకి క్షమించు బావా," అని కంట తడిపెడుతూ వెళ్లిపోతోంది. తన తెలివితక్కువకి తనని తానే నిందించుకున్నది. ఏమనాలో తోచనూ లేదు. తన కృతజ్ఞత వెల్లడించాలనుకొన్నది. మామయ్య అతన్ని అడిగి ఏమిటో తేల్చుకోవాలన్నాడు. ఏమని చెప్పదలచుకొన్నాడో ఆరాలడుగుదామనుకొన్నది. అతని ధోరణి బాగుండలేదు. లాభం లేదు. వెళ్లిపోతోంది. దీనత్వంలోకి దిగజారి వెనక్కయినా తిరిగిచూడకుండా వెళ్ళిపోతున్న ఆ అందాలరాశిని అలవోకగా చూచాడతను. ఆమె జడ పడగెత్తిన నల్లతాచుపామై కదలిపోతోంది. పరవళ్ళు తొక్కుతో ఆమె వెంటపడుతున్న పంటకాలవతోపాటు అతని చూపులు కూడా చూపందేవరకూ ఆమెని వెన్నంటే వున్నాయి.

శశిరేఖకి రాత్రి అన్నం రుచించలేదు. రాత్రి అంతా నిద్దరపోయిం తరవాత తలగడ కన్నీటికాలవలుగా ఎంతోసేపు ఏడిచింది. ఆబాధ ఏమిటో తెలియలేదు. నిజంగా అతని కపకారం చెయ్యాలని తనకి లేదు. కాని అపకారం జరిగింది. అపకారం ఇంతా అంతా కాదు. అతనూ తల్లిదండ్రులు లేనివాడు. ఏ విధమైన ఆర్థికస్తోమతూ లేనివాడు. స్వతంత్రంగా బ్రతకలేనివాడనీ కాదు గొప్ప అందకాడు కాదనీ కాదు. అతన్ని ఎంచేతనో వరుడుగా స్వీకరించలేకపోయింది. లోలోపల తరిచి చూచుకుంది మొట్టమొదటిసారిగా. అతను చాలా అపోహపడుతున్నాడు. తన కెవరిమీదనో మోహమున్నదని అనుకుంటున్నాడు బహుశా. నిజానికి తన మనస్సు ఎవ్వరిమీదా వాలలేదు. మనసులూ మమతలూ, విరహాలూ, వ్యామోహాలు ఇంకా తనని ఆవరించలేదు.

కోటు చిలకకొయ్యకి తగిలిస్తూ మామయ్య అత్తయ్యతో చెబుతున్నాడు. శశిరేఖ జాగ్రత్తగా వింది. చంద్రరావుతో ఆ ప్రస్తావన తెచ్చాడట. నిజమేనని తక్షణం వొప్పుకున్నాడట. అట్లాంటి లోపాన్ని స్వార్థంకొద్దికీ తను దాచినందుకు చేతులు పట్టుకుని క్షమాపణ వేడుకున్నాట్ట. మామయ్యకీ కళ్ళు చెమ్మగిల్లినై. అంత చక్కని కుర్రవాడికి ఎట్లాంటి వ్యాధి! ఎంత బుద్ధిమంతుడు!! ఎంత వుదారగుణ మతనిది. ఎంత తెలివితేటలైనవాడు. కాలేజీలోనూ, ఆవూళ్లోనూ అతనికెంత మంచిపేరు! "ఇంతకీ శశి దురదృష్టవంతురాలు" అని పెదవి విరిచారంతా. శశిరేఖ కిదంతా ఆశ్చర్యంగా వున్నది. ఇంకా అతను "నాకు వ్యాధిలేదు, సింగినాదంలేదు కావలిస్తే డాక్టరు పరీక్ష చేయించుకో" మని నిగ్గదీస్తాడేమో ననుకుంది. అతని మాటంటే మామయ్య కెంతో గౌరవం. ఆ చురుకుచూపుల వెనక, కరుకుమాటల వెనకా తనంటే ఎంత మెత్తగా స్పందించే హృదయమున్నదో, ఆమె కవగాహనయింది. తననించీ యేదో వొక ఆత్మీయతని పుణికి పుచ్చుకుంటున్నాడా అనిపించింది.

* * *

చంద్రరావూ, రఘూ క్లాసుమేట్లూ, రూముమేట్లూకూడా. ఆవేళ రఘు మంచి బందోబస్తుగా టాయిలెట్టయ్యాడు. అందమైన హవానా సూటు బనాయిస్తూ, తచ్చాడుతున్నాడు గదిలో. చంద్రరావు,

తన క్లాసు పుస్తకాలలో ఫోటోలు చింపి, అవతల పారేస్తున్నాడు. అట్లాంటి వొక ఫోటో రఘుమీద పడింది. ఏమిట్రా యిది. ఇంత చక్కని ఫోటోలు చించిపారేస్తున్నావట్రా. నీ కక్కర్లేకపోతే ఇట్లా పారెయ్యి అన్నాడు రఘు. "ఫోటోలతో కర్మమేమిట్రా, అట్లాంటి అసలైన పిల్లవొకతె సాక్షాత్తూ మా వూళ్ళోవుంది. కావాలంటే వెళ్లి తెచ్చుకో." అన్నాడు చంద్రరావు. "నిజం?" అని ఫోటోవంక కొంత పరిశీలనగా చూచుకున్నాడు రఘు. ఆ వేళ వొక సంబంధం చూచుకుందుకు వెళుతున్నాడు రఘు. ఏదో వొక పల్లెటూరిపిల్ల, ఇక్కడ వాళ్ళ బంధువులయింటికి వచ్చిందట గణపతి నవరాత్రులకు. చూచిపొమ్మని ఆహ్వానం వచ్చిందతనికి. స్నేహితులిద్దరూ పెళ్లిచూపులికి బయలుదేరారు.

రఘు ధనవంతులబిడ్డ. పిల్ల అందంమీదా, చదువుమీదా చూపతనికి; సంప్రదాయంమీదా, కట్నంమీదా చూపతని తండ్రికి. ఆయన నిర్ణయించిన సంబంధమితనూ, ఇతను అవునని తలవూపిన సంబంధం ఆయనా రద్దుచేసుకుంటూ వొస్తున్నారు. రఘూ భయస్తుడు. ఆదర్శాలకీ, ఆశయాలకీ పుస్తకాలలో యిచ్చినంత విలవ ఆచరణలో ఇవ్వడం సాహసమన్న మతంలో మనిషి. "నీకు నచ్చిన పిల్లని చేసుకోరాదుట్రా" అంటే, పితృభక్తిని ఆదర్శంగా చెపుతాడు. పోనీ పెద్దవాడు ఆయన నిర్ణయించిన సంబంధమేదో అహోరించరాదా అంటే, అమ్మో పిల్ల అందంగా వుండాలి, చదువులూ, సంగీతాలూ వెలిగిస్తూండాలి అని గొంతెమ్మకోరికలు వెళ్లబోస్తాడు. "ఇట్లాగయితే నీకు పిల్ల అమిరినట్టే." అని చంద్రరావు వొకసారి ఎత్తిపొడిచాడు. "మించిపోయిందేముందీ, అన్నీ అమిరితేనే చేసుకుంటానూ" అని సారాంశం తేల్చాడు రఘు. అంటే కావలసిన కట్నాలూ, కానుకలూ, లాంఛనాలూ, ముట్టజెప్పి, అందమూ చందమూ అమిరిన పిల్లని, చదువులూ సంగీతాలూ నేర్చిన పిల్లని సమర్పణచేస్తే దయాధర్మభిక్షకింద స్వీకరిస్తాడు. అదీ అతనికి చాతనయింది.

పెళ్ళికూతుర్ని, తీసుకొచ్చారు. గుమ్మడిపువ్వులో మంచుబొట్టులా, పచ్చని తివాసీమీద పొందికగా కూర్చుంది శశిరేఖ. చంద్రరావు తెల్లబోయాడు. పెళ్ళిచూపు లయినాయి. పక్కకి తీసికెళ్లి "ఈ పిల్లనెక్కడో చూచినట్టుందిరా" అన్నాడు రఘు. "ఆ ఫోటోలో పిల్లరా," అన్నాడు చంద్రం. "ఆ!" అని తెల్లబోయాడు రఘు. "అయితే, ఇహనేం, కట్నమూ గట్రా లావుగా యిప్పించొరేయ్." అని గునిశాడు రఘు. సరిపోయింది! రామయ్యగారూ వచ్చారు. రఘూని తప్పించి రామయ్యగారూ చంద్రరావూ లోపాయికారీగా మాట్లాడుకున్నారు. రఘూ పరిస్థితులు సాకల్యంగా విడమర్చి చెప్పాడు. రామయ్యగారికి. అన్నివిధాలా అవలంబించదగిన సంబంధమన్నాడు. పెళ్ళికొడుకుని వొప్పించే భారం నీదేనని రామయ్యగారు అర్థించాడు. "ఇదిగో, ఇప్పుడే వుపక్రమిస్తున్నా" అని చంద్రరావు "వొరేయి అబ్బాయీ! చెబుతున్నావిను. డబ్బు శాశ్వతం గాదు, అగ్నిహోత్రం లాంటి కుటుంబం. వజ్రపు నెరుసులాంటి పిల్ల. చదువులకు సరస్వతి. పాట పాడిందంటే మాటలు పెదవులమీద నించీ వస్తున్నాయో, వీణతీగలమీదనించీ వస్తున్నాయో గుర్తించడం కష్టం. నీ యింటి కొక వెలుగనుకో!" అని ముగించాడు. బావుంది వర్ణన! శశిరేఖ కిటికీలోంచి చూస్తో సిగ్గుపడింది. రఘు చాలాసేపున్నాడు. చందర్రావొక స్నేహితుడుగా, హితైషిగా పెద్దమనిషిగా, మధ్యవర్తిగా, ఎన్నోవిధాలుగా బోధించి చూశాడు. "పిల్ల నచ్చిందీ" అని అతనిచేత పలికించడానికి రెండు గంటలు పట్టింది. ఆఖరికి వొక మాట యిచ్చాడతను. కట్నాలేమీ యివ్వకపోయినా తండ్రికి నచ్చజెప్పిచూస్తానన్నాడు. ఆయన అంగీకారం లేనిదేమటుకు తను స్వతంత్రించనని నొక్కి చెప్పాడు. కొంత నయమనిపించింది. రఘు వెళ్ళిపోయాడు.

చంద్రరావు ఆ రాత్రి భోజనానికుండిపోయాడు. పంచపాళీలో కుర్చీ వేసింది శశిరేఖ. కూచున్నాడు. ఎవరూ లేరు. "నచ్చాడా" అని ప్రశ్నించాడు అంతర్యంగా. సిగ్గుపడింది. "మళ్ళీ కొంప ముంచకు, మహాతల్లీ" అన్నాడు. హాస్యంగా నవ్వింది. శశి అత్తయ్య వొచ్చింది. చిన్నతనంనించీ ఎరిగున్నమూలాన అతనంటే ఆవిడ కెంతో అభిమానం "జరిగిందేదో జరిగిపోయింది. నువ్వు కాబట్టె అన్నీ మర్చిపోయి తల్లీ తండ్రీ లేని పిల్లయినందుకు ఇంత శ్రమ తీసుకుంటున్నావు నాయనా. ఇంకొకరయితే గర్భశత్రువులుగా మారిపోయేవారు. నీ పెత్తండ్రి సరేసరి మమ్మల్ని చేస్తున్న యాగీ ఇంతా అంతా కాదు" అని ఏకరువుపెట్టిందామె. "తప్పంతా నాదేనండి, ఆ సందర్భంలో నా లోపం నేను చెప్పేసి వుండాల్సింది మీకు. భగవత్కృప వల్ల మీ రెట్లా తెలుసుకున్నారో గాని నా కాశ్చర్య

మయింది. లేకపోతే శశి జీవితం గంగపాలయ్యేది." అని నేరస్తుడల్లే తల వంచుకున్నాడు చంద్రరావు. "విచారించకు నాయనా, నీ మంచితనమే నిన్ను రక్షిస్తుంది." అని వోదార్చిందామె. శశిరేఖ గది గుమ్మందగ్గర వోరగా నిల్చుని వింటోంది. పాపం తనకోసమని అత నెంత అసహ్యాకరంగా, అవమానకరంగా నటించాలిసొచ్చిందో! తలుచుకొంటే, ఆమె అంతరాత్మ ఘోషించింది — భోజనాల వేళయింది. శశిరేఖ అప్పడాలూ వొడియాలూ వేయించింది. మామయ్యకీ చంద్రరావుకీ, వెండికంచాలుంచి వడ్డన కుపక్రమించబోయింది. "మామయ్యకి తరవాత వొడ్డిస్తువుగాని లే" అన్నది అత్తయ్య. "అతని కొక్కడికే కేటాయింపుగా వొడ్డిస్తే ఏం బావుంటుందీ" అని కించపడుతోంది శశి. "చెప్పినమాట వినవమ్మా తల్లీ, క్షయంటే దారుణమైన అంటువ్యాధి నీకు తోచదు, చెబితే వినవూ, చచ్చే చావయింది నాకు" అని చీదరించుకున్న దామె. కంచాలు తీసి వొక్కటే విస్తరి వెయ్యడం చూచాడు చంద్రరావు. గ్రహించాడు. తను భోజనానికి నిలవడం పొరబాటు. చెయ్యి కడుక్కుని పంచపాళీలోకి వచ్చేస్తూ గుమ్మందగ్గర ఆగి విన్నాడు. "నువ్వే ఎత్తు ఆ విస్తరి. అత నెత్తేస్తాంటే వొద్దని సైగచేస్తా వెందుకూ, నువ్వే! అనుభవించు" అని తుస్కారిస్తోంది అత్తయ్య తను వ్యాధిగ్రస్తుడన్న సంగతి ఘడియఘడియకి జ్ఞాపకముంచుకోవాలిహాను. రామయ్యగారితో మాట్లాడి వెళ్ళిపోతున్నాడు చంద్రరావు. తలుపు వేసుకుందుకు శశిరేఖ వచ్చింది. "చెప్పేస్తాను" అంది.

"ఏమనీ?"

"నేనే ఆ వుత్తరం నీచేత వ్రాయించానని నీ క్షయమాట అబద్ధమనీ"

"నష్టమెవరికో ఆలోచించి చూచుకో," అని చక్కాబోయాడు.

* * *

పొద్దున్న లాడ్జిలో రఘు చదువుకొంటో, చంద్రరావుదగ్గర కొచ్చి, "ఏమిరోయ్, మా వూరు పిల్లంటున్నావు, నీకేమయినా పాత పురాణ మేమిట్రా" అన్నాడు చటుక్కున. ఏడిశినట్టేవుంది. ఆవిడకీ తనకీ మధ్య ప్రణయకాండ ఏమీ నడవలేదని వాడి బుర్రకెక్కించేసరికి తలప్రాణం తోకకి వచ్చింది. కొంత అసత్యమూ చెప్పాలిశొచ్చింది. కొంతమంది ఎంత కుళ్లుగా ఆలోచిస్తారూ!

సెలవల్లో రఘు సర్వవరం వెళ్ళిపోయాడు. చంద్రరావూ, రామయ్యగారూ సర్వవరం బయలుదేరివెళ్ళారు సంబంధం ఖాయం చేసుకుందుకని. రఘు తండ్రి సూరపరాజుగారు అతిలౌక్యుడు: ఆయన కొరుకుపడలేదు.

సెలవల్లో చంద్రరావు ఇంటికి వెళ్ళలేదు. అతనూ పెత్తండ్రీ ఘర్షణపడ్డారు. ఏవో అడనారకం సంబంధాలకి...తన మెడలు విరుద్దామని చూస్తాడు. దానితో అతను సెలవల్లో పెంటపాడు వెళ్ళడం పడలేదు. కాకినాడలోనే వుండిపోయి, మూడు నాలుగు మంచి ట్యూషనులు ఏర్పాటు చేసుకున్నాడు.

* * *

రకరకాల సంబంధాలు చూశారు, చంద్రరావూ రామయ్యగారూ కలిసి. రామయ్యగారు చూడామనుకొన్నవి కొన్నీ, చంద్రరావు ఎరికలో వున్నవి కొన్నీ, "డబ్బవడికి కావాలండీ. బోగంది గడిస్తుంది. పిల్ల చక్కదనమూ సంప్రదాయమూ కావాలిగాని" అని ప్రారంభించి, తీరా ముగ్గులోకి దిగింతరవాత కట్నాలూ, లాంఛనాలు ఆడబడుచు కెంతో, అలక కెంతో, మనుగుడుపుల కెంతో, కార్యానికెంతో, బాలతొడుగెంతో రూపాయణా పైసలతో అనుకున్న అంకెకి అంది వస్తేనేగాని వొక తెన్నుకురాని సంబంధాలు, పూటకిటికాణా లేకపోయినా పిల్ల పెళ్ళికున్నదీ అనగానే కట్నమెంత యిస్తారూ అన్న బేరంతో మొదలయ్యే సంబంధాలు, లక్షలున్నాయనిపించి ఆఖరికి వున్న ఆస్తులూ చేసిన అప్పులూ లెఖ్ఖవేసిచూస్తే అంకె మిగలకపోయినా ఆకాశయానం చేసే సంబంధాలు, నీటూ గోటూ బోటుగా పెట్టుకుని చూపదగిన ఆస్తులు లేకపోయినా మా అమ్మమ్మ ఆస్తి నాకే వస్తుంది, మా మేనత్త నాకే రాస్తుంది, అని గాలిమేడలలో కూచుని పంకాలు లాగించుకోవాలని చూసేసంబంధాలు చూచిచూచి ప్రాణం విసిగింది.

శశిరేఖ అన్నీ వింటూనే వున్నది. "బిళ్ళపెట్టుగా అంతా వొచ్చిపడ్డాము. వొకరోజా, వొక వారమా, మళ్ళీ వస్తామ"ని చెప్పి రామయ్య భార్యా పిల్లలూ, శశిని మాత్రం కాకినాడలో పినతల్లిగారింట దిగవిడిచి వెళ్లారు. చంద్రరావు తిరుమరావడం లేదు. వచ్చినా తనవంక చూడ్డంగాని తనతో మాట్లాడడంగాని పూర్తిగా మానుకున్నాడు. శశి పినతండ్రి, కలవాడూ, చాలా పెద్దమనిషీ. ఆయనా తాపత్రయ పడుతూనే వున్నాడు. చంద్రరావు గ్రహించాడు, ఎవ రెంత తాపత్రయపడినా పెళ్లిఖర్చులు మినహా,

కట్నాలరూపేణా గాని కానుకలరూపేణా గాని చిల్లి గవ్వ భరించేవా రెవరూ లేరని.

శశిరేఖ చంద్రరావుతో ఆంతర్యంగా మాట్లాడా లనుకొన్నది. తన కష్టసుఖాలు, ఎవరితోనూ అంతవరకూ ప్రస్తావించని సాధక బాధకాలు అతని ముందు ఏకరువు పెట్టాలని తపనపడింది. కాని అతను తనచుట్టూ వొక గోడలాంటిది కట్టేసుకుంటున్నాడు. తను తొంగిచూచేందుకు వొక కిటికీ అయినా వొదలని ఇనుపగోడ. ఆమధ్య వొకసారి పెంటపాడు వెళ్ళివచ్చింది. చంద్రరావు అక్కడికి రావటమే లేదట. రామయ్యగారుగాని, ఆయాన తాలూకు గాని అతని విషయం పట్టించుకోనే పట్టించుకోరు. అతను మాత్రం మా పెదనాన్న, మా పెదనాన్న అని వూసుకుంటాడు. అతని జీవయాత్ర అంతా నిగూఢమయింది. అతని కష్టనిష్ఠురాలు అతను చెప్పకోగా ఆమె యెప్పుడూ వినలేదు. అతని పుస్తకాలకి గాని, జీతాలకి గాని, తిండితిప్పలకు గాని పైసా యివ్వడు పెత్తండ్రి. మరి యెట్లా బండిలాగుతున్నాడో భగవంతుడికే తెలియాలి. తనకి గాని, తన మేనమామకి గాని తమ పనులమీద వినియోగించుకోవటం మినహా అతని కెట్లా గడుస్తుందో, ఆలనా పాలనా సూచనగానైనా అడిగి తెలుసుకుందామన్న శ్రద్ధ లేదు తన మేనమామ సరేసరి అతను రాగానే అక్కడ సంబంధం గొడవతోనూ, ఇక్కడి సంబంధం గొడవతోనూ అతి ఆత్రంగా అతన్ని తోమితోమి, భోజనాలవేళ దాటినా, భోజనానికి వుండమని లాంఛనప్రాయంగానైనా అనడు. ప్రయాణంలోనూ గట్టా అతనిఖర్చులు అతనే భరిస్తున్నట్టు మామయ్య ధోరణిలో ఒకనాడు పసికట్టింది. మామయ్య సంగతి తెలీదూ! తనని ఆ బంధువుల ఇంట్లోనూ ఈ బంధువుల యింట్లోనూ, నెలల తరబడి వుంచేస్తాడు. తొందరపడి వాళ్ళేమనుకొంటారోనని తనంతట తానే ఇంటికొచ్చేస్తే కూకలు వేస్తాడు. ఒక పెళ్ళిచూపులికి ముస్తాబవుతూంటే ఇంటిదగ్గర సిల్కు చీర మర్చిపోయివచ్చిందని తనని పట్టుకుని ఝాడించేశాడు చంద్రరావుసమక్షంలో — ఇంటిదగ్గిర తనకి నిజంగా వొక సిల్కు చీర వున్నట్టు — చంద్రరావు వొక జార్జెట్ సిల్కు చీర కొని తీసుకొచ్చాడు. ఈసారి పెంటపాడునుంచి రాగానే పైకమిచ్చేస్తానెమ్మని, మామయ్య చంద్రరావుతో రెండుమూడు సార్లు స్పష్టంగానూ, ఆతరవాత నసుగుతోనూ అన్నాడు. రోజులు గడిచింతరవాత మర్చిపోయినట్టు నటిస్తున్నాడు. ఆచీర కట్టుకొన్నప్పుడల్లా తనవొళ్ళు గరిపొడుస్తుంది.

కాకినాడలో పింతండ్రియింట్లో ఆమెకి కొంత చనువున్నది. ఆయనకి శర్వరీటాకీసులో భాగముంది. నెలకి 40 పాలు టిక్కట్లు వస్తాయి. పింతండ్రికొడుకు రవణని ఎనిమిదేళ్ళ కుర్రకుంక వొకడున్నాడు. వాడు చీటికీ మాటికీ శశిరేఖని సినిమాకి తర్లించడం మరిగాడు. కథా, కథలో చిన్న చిన్న ఘట్టాలూ రసవంతంగా విడమర్చి చెబుతుంది. అంచేత చూచిన సినిమాకే మళ్ళీమళ్ళీ ఆమెను వేధించి తీసుకెడుతూ వచ్చాడు. చంద్రరావు కిప్పుడు పరీక్షలయిపోయినై. లాడ్జిలో వొక గది తీసుకొని వొంటరిగానే వుంటున్నాడు. లాడ్జి సినిమానుంచి వచ్చేతోవలోనే వున్నది. వచ్చి, పొయ్యేటప్పుడు అది వొక ఆకర్షణగా పనిచేస్తోంది ఆమెలో ఒకటి రెండుసార్లు అతనిలాడ్జి పక్కనే రవంత నెమ్మదిగా భయంగా నిల్చుని తిరిగి వచ్చింది. ఎప్పుడు చూచినా ఆ మేడగది కిటికీదగ్గిర చదువుకుంటూ కూచుంటాడు పరీక్షలయినా ఏమిటో చదువు! మేడ మేడంతా చీకటిమయం అక్కడ మాత్రమొక చిన్న లైటు. ఆ లైటువెలుగున చిత్రంలో బస్టు ఫొటోలా, అతను తదేక దీక్షగా చదువుకుంటూ కూచునే భంగిమ. ఒకనాడు రెండోఆట అయిన తరువాత తిరిగివస్తోంది రవణతో. వీధి వీధంతా నిర్మానుష్యంగా వున్నది. అతను మాత్రమింకా ఏదో రాస్తూ కూచున్నాడు. తనకోసం అంతింత తాపత్రయాలు పడే వొక ప్రాణి, తన హృదయంలో ఇంతచోటు దొరుకుతుందేమోనని గాలిస్తున్న ఆ చిన్న మెదడు అట్లా ఆ పుస్తకాలలో లీనమయిపోయివుంటం కొంత కష్టంగానే వుంది. అతనేమి చేస్తుంటాడో, ఎట్లా కాలక్షేపం చేస్తుంటాడో తెలుసుకోవాలని మనస్సు రెపరెపలాడుతోంది. వెళ్లి పలకరించాలనుకుంది. అంతరాత్రివేళ! ఏమనుకొంటాడో!......వెళ్లింది. పక్కని రవణ వున్నాడుగా. ధైర్యం తెచ్చుకుంది. వొక్కొక్కటే మెట్లు ఎక్కి, నిలబడింది గదిలో. అతను వులిక్కిపడ్డాడు. "ఎక్కడనించీ?" అతని ప్రశ్నలోనే ధూపు లాగిపోయినాయి. ఆమె గది అంతా కలయజూచింది. పుస్తకాలక్కడా ఇక్కడా చెలాచెదురుగా లేవు. వుంటే సర్దుదామనుకున్నది. కూచోమని సైగచేశాడు. ఉత్తరాలు కొన్ని టేబిలు మీద అడ్డదిడ్డంగా పడివున్నాయి. "వ్రాచకి కుచ్చుకోరాదూ?" అని వుప్రకమించింది "అవి ఇంకా పరిశీలించాలిసి వున్నదిలే" అని వారించాడు. క్యాలండర్లో పాత నెలల కాయితాలు చింపుదామని బయల్దే

రింది. "అందులో కొన్ని తారీఖులు గుర్తు చూసుకో వాలి లే—చింపకు, చింపకు" అని అభ్యంతరాలు పెట్టాడు. అతనిమీద కోపమొచ్చింది. తనచేత వివిధమైన పనులూ చేయించుకోగూడదని మతం గావును. ఏమిటో తెగ వ్రాస్తున్నాడు కాయితాలతని చేతుల్లోంచి చనువుగా లాక్కొని చదివింది. అర్థం కాలేదు.

"ఏమి టిది?"

"ఒక వ్యాసం లే"

"దేనిని గురించీ?"

"వృక్షశాస్త్రంలో వొక థీసిస్"

"ఎందుకూ సెలవలలో"

"ఒక పోటీ పరీక్షకని"

ముక్కలొచ్చే ముక్క, ముక్తసరిగా సమాధానం చెప్పాలి గావును!—చిరాకుపడింది.

"చాలా కష్టపడుతున్నావు, పిచ్చిజుట్టొచ్చేట్లా వున్నావులే" అన్నది...తలవొంచి నిట్టూర్చాడు... వెళ్లిపోబోయింది. కదిలిద్దామని "కూచో, ఏం భయంగా వున్నదా?"

"భయ మెందుకూ" పైటకొంగు తెగ మెలి వేస్తోంది.

'ఏమోలే'

'కొంచెం చెడ్డవాడవయినా బావుణ్ణు"

"ఎందుకూ?"

"కాస్త భయమైనా నటించేదాన్ని"

కిలకిల నవ్వు మెట్లు దిగింది రవణతో. అతను కిటికీలోంచి చూస్తూ నిలబడ్డాడు "ఈమె వొక కొత్త శశిరేఖ!" అనుకున్నాడు. శశిరేఖ గబగబా వెళ్ళి పోతోంది. వెనక్కి తిరిగిచూడకూడదనుకుంది. కాని అతను కిటికీదగ్గర నిల్చుని చూస్తున్నాడా లేక పోతే తక్షణం వ్రాతలోపడ్డాడా తెలుసుకుందుకు ఆత్రంగా వుంది. వెనక్కి తిరిగిచూచింది. అతను చూస్తూనే నిల్చున్నాడు. ఎక్కణ్ణించో వల్లమాలిన సిగ్గు ముంచుకొచ్చింది. అడుగులు తడబడ్డాయి. ఎందుకు చూచానా అని కించపడ్డది.

ధోరణి చూస్తే, సర్పవరంలో రఘు సంబంధమింకా మామయ్య వదులుకోలేదు. చంద్రరావు అడపా దడపా సర్పవరం వెళ్లివస్తున్నాడు. రఘు తండ్రి అతి లౌక్యుడు. తోంటచెయ్యి చూపడానికి తొంభైరోజులు తీసుకుంటాడు. అక్కడ జరిగిన మాటలూ వాళ్ళధోరణి వింటోంటే శశిరేఖకి చిటచిటలాడింది. అసలీ మనుష్య సంబంధాల గాలింపుల్లో ఆమెకి ప్రపంచం చాలామట్టుకు అవగాహనయినట్టనిపించింది. పెద్దమనుషులుగా హుందాగా రొమ్ములు విరుచుకునే యీ మగరాయళ్ళలో ఎంతమందికి నిజమైన జీవితపు విలువలు తెలుసునో, ఎన్నెన్ని స్వార్థాలు ఎన్నెన్ని మారువేషాలలో మనుషుల్ని నడుపుతవో ఆలోచిస్తే వొకవిధమైన విరక్తి కలిగింది. చంద్రరావుకి తన అభిరుచులు బాగా తెలుసును. మామయ్యకి యిష్టమైన కొన్నికొన్ని సంబంధాలు తన కయిష్టమని ఎట్లా గ్రహించేవాడో ఏవో లొసుగులు వెతికి తెచ్చి ఆయనమనస్సు మార్చేవాడు. చిత్రంగా కనిపించేది. తనకి పెళ్ళి చేసెయ్యాలని ఎందుకో అందరికీ ఇంత అలజడి. ఆ చంద్రరావుకి మరీను. అతని కెందుకో యీ దుగ్ధ తనకి పెళ్ళి కాకపోతే అతనికేమో. ఆ రఘుసంగతి మరీ చొంగలు కారుస్తూ చెప్పవస్తాడతను వొడలంతా చీమలు పాకినట్టుంటుంది తనకి. రఘు అందమైన వాడే. చదువుకొన్నవాడే. తనని చేసుకోవాలని మహా వుబలాటపడుతున్నాట్ట! తన అందానికి ముగ్ధుడై పోయాట్ట! ఏడవలేకపోయినాడా అనిపించింది శశికి. కోరిన కట్నాలతో కులుకుతూవస్తే వొళ్ళోకి తీసుకుంటాడు పాపం. వీళ్లకి సిగ్గులుండవా అని? నాకాపిల్ల నచ్చింది, ఈపిల్ల నచ్చింది అని చెప్పుకుందుకు. వో గుంజుకుని చస్తున్నాడు రఘు, కట్నమెట్లా రాబట్టాలా అని. తండ్రీ వాడూ లాలూచీ అని, శశికి గట్టి నమ్మకం. ఈ స్వార్థాలన్నిటికీ అతీతమైన అంతస్తులో మరకలు లేని, నిర్మలమైన తెరమీద తళుక్కుమని మెరిశాడు చంద్రరావు. రఘూ సమాధానానికి అంగీకారంగా తల ఎందుకు వూపానా అనుకున్నది.

చంద్రరావు బి. యస్. సి. ఫెయిలయ్యాడు. ఒక చెంపని ట్యూషన్లు చెప్పుకోడంలో, ఒక చెంపని తన పెళ్ళివ్యవహారాల గజిబిజిలో చదువు సాగలేదేమో అతనికి. మళ్ళీ యిహ చదవనన్నాడు. పెన్సిల్ మాన్యుఫాక్చరింగ్ పెట్టుకోవాలని అతని కొక ఆశ.

దానికి రెండుమూడు వేలన్నా కావాలి. మెషినరీకీగట్రా. చంద్రరావుకి తెలియందిలేదు. ఎలక్ట్రిక్ వర్కుషాపులోగాని ప్రెస్ వర్కులోగాని, ఏ పరిశ్రమలో ఎంత గిట్టుబాటవుతుందో అవలీలగా అంచ

నాలు వేయగలడు. అన్ని పరిశ్రమల కీలకాలూ అవగాహన చేసుకోగలడు. మామయ్యలో అతను కొన్ని కొన్ని పథకాలు చర్చిస్తూంటే ఆ పరిభాషే అర్థమయి చచ్చేదికాదు. డబ్బులేనివాడి బుర్ర ఎంత చురుగ్గా పనిచేస్తుందో ఆమె కర్థమయింది.

నెలలు గడిచినై.

మామయ్య ఒక శుభవార్త తెచ్చాడు. చంద్రావుకి ఆంధ్రవిద్యాలయం బహుమతేదో వచ్చిందట మూడు వేలట! "ఏదో పాపం, గుడ్డిలో మెల్ల" అని సంతోషించాడు మామయ్య. పేపర్లోపడి వారం రోజు లయిందట...తను చూడనేలేదు. లాడ్జికి వెళ్ళి వొకసారి పలకరిద్దామా అనుకున్నది. తనతో చెప్పలేదని కొంత రోషంగానూ వున్నది. ఆవేళ రవణని సినిమాకు లేవదీద్దామని ప్రయత్నించింది. వాడు రథోత్సవం సరదాలో పడివున్నాడు. మహా చికాకు పడ్డది. ఆవేళ సినిమా రకరకాలా వర్ణించి చెప్పింది. వాడి బుర్ర కెక్కలేదు. విసుక్కుంది. మామయ్యతో కూడా వెళ్ళి అతన్ని అభినందించివద్దామనుకున్నది. కాని అతను పట్నానికి వెళ్ళాట్ట. సరిపోయింది! ప్రైజందుకొందుకు గావును. ఆమె నిరుత్సాహపడింది.

శశిరేఖా రామచంద్రయ్యగారూ, కుటుంబ సమేతంగా పెంటపాడు వెళ్ళిపోయారు. చంద్రావు మళ్ళీ రాలేదు. కాకినాడకి వెళ్ళిపోయాడేమో తెలియదు. మామయ్యకీ అతనికీ ఉత్తరప్రత్యుత్తరాలు నడుస్తుండటం గమనించింది.

ఆనాడు శ్రీరామనవమి. వూళ్లో భరతనాట్యం. పిల్లా మేకా అంతా వెళ్లారు.

శశిరేఖ గబగబా కంచాలు కడిగేసి గాడిగేదెకు కుడితి గోలెంలో పోసి ఇంటికి తాళంపెట్టి తనూ వెడదామని ఆలోచిస్తోంది. ఎవరో లోపలి కొస్తున్నారు, "అత్తయ్యా" అని పిలుస్తో; "లేరండీ" అని కేక వేసింది. గబగబా పెరట్లోకి వచ్చాడతను. చంద్రావు! నైట్ క్వీన్ మొక్క సువాసనలు గుప్పున విసిరికొట్టింది. అతను మాంచి ఉత్సాహంగా వున్నాడు. "కూచో బావా" అని ముక్కాలిపీట నూతికి దగ్గరసా లాగింది. "వో మాట చెబ్దామని వచ్చాను శశీ." చందమామవంక చూస్తున్నాడతను. "నేను పది మాటలు మాట్లాడదా మనుకుంటున్నాను సరా" అని జడలో చెండు సర్దుకున్నది శశిరేఖ. "రఘు సంబంధం సెటిలయింది." ఎంతో సంబరపడుతుందనుకున్నాడు. పైపెచ్చు "చట్, ఈ మగతనంలేని సంబంధాలన్నీ చూస్తావెందుకు బావా నువ్వు" అని చీదరించింది. సరిపోయింది! "ఈ నటన కేమిలే" అని వోరకంట చూచాడతను—"అంటే, ఆ రఘుమీద నాకు తహతహగా వున్న దనుకుంటున్నావుకదూ నువ్వు?"

"పోనీ ఆ తహతహ అతనిమీద నీకు కాదుగాని, వాడికి నీమీద, సరేనా!"

"అయ్యో రామ! నామీద అంత తహతహగా వుంటే వొక రెండు వేలు ఎక్కడైనా తెచ్చుకుని చదివించుకోరాదూ"

"ఆ అరేంజిమెంటే చేసివచ్చా. నా ప్రైజు సొమ్ము రూ 3000/ లు చెక్కు వచ్చింది. అతనికి ఎండార్సు చేసి యిచ్చేసివచ్చాను."

"పాపం యిహ కులుకుతూ పెళ్లి చేసుకుంటానన్నాడుకదూ—దేవయ్య!"

"శశీ, నీకు కాబోయే భర్తనట్లా ఈసడించకూడదుసుమీ" అతను సీరియస్ గా మొహం పెట్టాడు.

"నా పెళ్ళి నువ్వు చూడనఖ్ఖర్లేదు తెలిసిందా"

"చూడనఖర్లేదూ?"

"అఖ్ఖర్లేదు. నేను చూచుకోగలను. చూచుకున్నాను గూడా."—అతని జేబులో వున్న ఫౌంటెన్ పెన్నులాగి అతని అరచేతిలో వ్రాసూ వర్ణక్రమం వల్లిస్తోంది. నకార ఈకారములు "నీ" వకార ఏకారముల "వే"—చెయ్యి లాక్కున్నాడతను. నూతిపక్కని అతని సరసనే నుంచుని కొంటెగా అతని కళ్లల్లోకి చూచింది శశిరేఖ.

"ఇట్లా బుద్ధిపుట్టిందేమిటీ" అతనికి నిజంగానే కోపమొచ్చింది.

"ఇదంతా కృతజ్ఞత గావును. అవునా?"

"ఛ—కృతజ్ఞతా? నీకా? దేనికీ? తిరిగావనా? బావుంది. ఎవరికోసం తిరుగుతావు" కిలకిల నవ్వింది. అతను మౌనంగా వూరుకున్నాడు. "నిజంగా బావా, నువ్వు నాకు అందంగానే వున్నావు." అతను ఫక్కున నవ్వాడు. ఆమె బుంగమూతి పెట్టి "నేనబద్ధాలాడను, తెలుసా" అన్నది వోరచూపుగా.

"నేను నవ్వుతాలకి రాలేదు శశీ—నా శశిని మకిలికళ్ళతో చూడలేదు నేను. నీలోని ఈ క్షణిక దౌర్బల్యాన్ని వుపయోగించుకుంటా ననుకున్నావేమో"

"ఏమిటి బావా, నిజమా?" ఆమె బిక్క మొహం పెట్టింది.

"నీ పెళ్ళికి రఘు తండ్రీ, నీ మేనమామ రామచంద్రయ్యగారూ, ఇవాళనే తాంబూలాలు పుచ్చుకున్నారు సర్వవరంలో. ముహూర్తం నిర్ణయమయిపోయింది. నీతో చెప్పిపోదామని వచ్చాను. తొమ్మిది గంటలబండీకి మద్రాసు పోతున్నా. ఇక మళ్ళీ మనం కలుసుకోము బహుశా." అని గబగబా వెళ్ళిపోతున్నాడతను "నాకీ పెళ్ళి అక్కర్లేదు." అని గునుస్తో చొక్కా పట్టుకుంది. అత నాగాడు.

"శశీ, నీమనస్సు నీకు తెలియదు. నాకు తెలుసు. రఘు బుద్ధిమంతుడు, చదువుకున్నవాడు. తగినంత ఆర్థికస్తోమతు కలవాడు, నీ ఆకర్షణకి గురి అయిన అదృష్టవంతుడు, నిన్ను ప్రాణప్రదంగా చూచుకుంటాడు, పిచ్చిపిల్లా, బావ యేదో నాలుగుసార్లు నీకోసం ఇటూ అటూ తిరిగాడుకదా అని, నీ హృదయాన్ని అర్పణ చేసుకోవాలని చూస్తున్నావా? పో! పో! పోయి కళకళలాడుతూ జీవితంలోకి అడుగుపెట్టు. నన్ను మరిచిపో. లేకుంటే చిక్కులపాలయిపోతావుసుమీ"

తల వంచుకుని వింటోంది శశి. అతను వెళ్ళిపోతున్నాడు. "బావా, బావా" అని పిలుస్తోనేవున్నదామె. ఏదో బరువు దించేసుకుని పారిపోతున్నవాడల్లే కనిపించాడు. శశిరేఖ అట్లానే నిలబడిపోయింది. వేడివేడి కన్నీళ్లు ఆమె చెంపలమీదనించీ పెరట్లో గుమ్మంముందు పోసుపడివున్న ఎండురావాకులమీద చిటపటమని రాలాయి. పక్కయింటి మదురుగోడ మీదనుంచి వాలిన సరుకు చెట్లనీడలు చీల్చుకొంటూ పోతున్నాడతను. తన జీవితంలోకి వద్దు పొమ్మన్నప్పుడు వచ్చి, రా రమ్మన్నప్పుడు వెళ్లిపోతున్న ఉదారమూర్తి! అందాన్ని గుర్తించగల ప్రజ్ఞా, హృదయాలు పంచుకోగల నేర్పూ తనకి అలవరచిన త్యాగమూర్తి!! ఏ పాటలూ ఎరుగని, ఏ కృతులూ మోగని, తనలో ఎన్నడో బూజుపట్టి, ఏమూలనో పడివున్న అనురాగ వీణని అతిసున్నితంగా మీటి, పోతున్న గంధర్వమూర్తి!!!

అతను ఇక రాడు!